## 2

# అబ్రాహాము - రక్షణ ప్రారంభము

## (ఆదికాండము 12 మరియు 15)

"ఏ వ్యక్తినీ తక్కువ అంచనావేయకూడదు" అని చెప్తుంటారు. ఈ మాట పరిశుద్ధ గ్రంథంలోని ప్రతి కథ విషయంలోని సత్యము. ఎందుకంటే దేవుడు ఏ వ్యక్తి ప్రాధాన్యతను తక్కువగా చేసి చూడలేదు. ఆదాము అనే ఒకే ఒక వ్యక్తితో మానవ జాతి ఆరంభమయింది. తరువాత కాలంలో ఆదికాండము 6వ అధ్యాయములో నోవహు అనే ఒకే ఒక్క వ్యక్తితో తిరిగి మానవజాతి మనుగడ ఆరంభమయింది. ఆ తరువాత ఐగుప్తు బంధకాలనుండి ఇశ్రాయేలు జాతికి మోషే అనే ఒకే ఒక వ్యక్తితో విముక్తి లభించింది. అలాగే ఇశ్రాయేలు యొక్క మెస్సీయ ఈ లోక రక్షకుని జననం ఒక స్త్రీ (నిజానికి, ఒక యౌవ్వనస్థురాలు) ద్వారా జరిగింది.

కాబట్టి పాపము అనే సమస్యకు (ఆదికాండము 3వ అధ్యాయములోని సంఘటన ప్రతిఫలం) దేవుడు సూచించిన పరిష్కారము కూడ ఒక్క వ్యక్తితోనే ఆరంభమవుటలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. ఆ వ్యక్తి అబ్రాహాము. అతని మొదటి పేరు "అబ్రాము."

ఈ లోకము యొక్క సృష్టి. మానవ జాతి, పాపము యొక్క ఆరంభమువంటి విషయాలను ఆదికాండము 1–3 అధ్యాయాలు తెలియజేస్తుండగా, 4 నుండి 11 అధ్యాయాలు ఆదాము హవ్వలు తోటనుండి వెళ్ళగొట్టబడడం. తరువాత చోటు చేసుకున్న దుష్పరిణామాలను తెలియజేస్తున్నాయి. కాబట్టి దేవుడు తిరిగి తన సృష్టిని తన చిత్తమునకు అనుగుణంగా తీసుకురావడానికి అబ్రాహామును ఒక సాధనంగా వాడుతున్నాడు. ఈ పిలుపు ఆదికాండము 12 మరియు 15 అధ్యాయాలలో పేర్కొనబడింది.

ఇశ్రాయేలు యొక్క ముగ్గురు "మహా పితరులైన" అబ్రాహాము, అతని కుమారుడు ఇస్సాకు, మరియు ఇస్సాకు కుమారుడు యాకోబుల వరుసలో అబ్రాహాము మొదటివాడు. ఈ ముగ్గురు క్రీ.పూ. 2100–1700 సంవత్సరముల మధ్య జీవించినవారు.

అబ్రాహాము మనుమడు యాకోబునకు పన్నెండు మంది కుమారులు కలిగారు. వారి ద్వారా వచ్చిన గోత్రముల వారు గోత్రకర్తలు అయి వారందరూ "ఇశ్రాయేలు" దేశము అయ్యారు (ఇశ్రాయేలు అన్నది యాకోబు మారు పేరు; చూడు ఆదికాండము 32:28). ఇశ్రాయేలు ప్రజలనుండియే (ప్రత్యేకించి. యూదా గోత్రమునుండి) మెస్సీయ అయిన క్రీస్తు వచ్చారు. ఆయనే పాపమునకు అసలు పరిష్కారము. ఇదంతయూ ఒక వ్యక్తి పిలుపుతో అందుకతని విశ్వాస ప్రతిస్పందనతో ఆరంభమయింది.

ఆదికాండము 12:1–4లో దేవుడు అబ్రాహామును మొదటిసారిగా ఎదుర్కొన్నప్పుడు, ఇక్కడే దేవుడు తన "నిబంధన" గురించి మొదటిసారిగా పేర్కొన్నాడు. ఈ నిబంధన గురించిన వాగ్దానం మరియు స్పష్ట వివరణ 15:1–6లో ఇయ్యబడింది. ఈ రెండు వాక్య భాగములను పరిశీలించుట ద్వారా రక్షణ యొక్క స్వభావమును గురించిన కొన్ని విషయాలను మనం నేర్చుకొనగలం.

## దేవుని చిత్తానుసారముగానే రక్షణ యుంటుంది

మానవ జాతి రక్షణ అనేది మానవుల కృషి లేదా ప్రయత్నాలవలన రాదని అబ్రాహాముతో దేవుని నిబంధన స్పష్టం చేస్తుంది. సృష్టిగాథలో వలెనే ఇక్కడా దేవుడే మొదటి అడుగు వేస్తున్నాడు. మానవుల పునః సృష్టిలోనూ దేవుడే మొదటి కార్యమును చేయుటకు అడుగువేస్తున్నాడు. ఈ పద్ధతిని "ఎన్నిక" అని పిలుస్తారు. దేవుడు తన చిత్తమును జరిగించడానికి అబ్రాహామును అతని సంతానమును "ఎన్నుకున్నాడు." కొన్ని యూదా శాస్త్రులు చెప్పున్నట్లు ఈ ఎన్నిక అబ్రాహాము యొక్క మంచితనము లేదా సుగుణమును ఆధారం చేసుకుని జరుగలేదు. అబ్రాహాము పాపరహితుడు కాడు అన్న విషయాన్ని గ్రహించడానికి ఆదికాండము 16-25 వాక్య భాగములను చదివితే సరిపోతుంది. అతడు అబద్ధమాడాడు; విశ్వాసంలో తొణికిసలాడడు, కుటుంబమును సరిగా నిర్వహించలేకయున్నాడు. కాబట్టి దేవుడు అబ్రాహామును ఎన్నుకున్నాడు అంటే అది కేవలం దేవుని కృప మాత్రమే. అది అబ్రాహాము యొక్క అర్హతను బట్టి కాదు.

ఆదికాండము 12:2, 3లో దేవుడు తన ప్రణాళికా పరిధిని విస్తరింపజేశాడు. అబ్రాహామునుండి ఒక పెద్ద దేశం వస్తుంది. అందులోనుండి, "భూమిలోని సమస్త వంశములు" ఆశీర్వదించబడుటకు కారణమయ్యే వ్యక్తి వస్తాడు. 3వ వచనంలోని రెండవ భాగము కొన్ని తర్జుమాలలో ఈ విధంగా వ్రాయబడింది. "నీ ద్వారా భూమి యొక్క సమస్త వంశములు ఆశీర్వదింపబడును" (RSV). "నీలోనుండి భూమి మీదున్న వంశములన్నియు ఆశీర్వదించబడతాయి" అని ESV తర్జుమా పేర్కొంటుంది. అంటే ముందు తరాలు (ఇశ్రాయేలు గాక తక్కిన దేశాలు) ఆశీర్వదాన్నిచ్చేటప్పుడు అబ్రాహాము పేరును ప్రస్తావిస్తారని మొదటి వాక్యమునకు అర్థము. అలాగే అబ్రాహాము యొక్క సంతతి నుండి రక్షకుడైన క్రీస్తు వచ్చాడు. కాబట్టి అబ్రాహాము ద్వారా అన్ని దేశములు ఆశీర్వదించబడతాయన్నది రెండవ తర్జుమా యొక్క అర్థము. ఈ రెండు తర్జుమాలు సాధ్యమయ్యే అర్థానిస్తున్నాయి. ఇవి కొంతవరకు నిజమే కూడాను. అయితే రెండవ తర్జుమా గ్రంథకర్త యొక్క భావములకు అనుగుణముగా ఉంది. అంతేగాకుండా, మిగిలిన వాక్య భాగములు దీనినే సమర్థిస్తున్నాయి. ఏదేమైనా రెండు వాక్యముల ద్వారా దేవుడు ఈ లోకమును ఆశీర్వదించుటకు అబ్రాహామును సాధనముగా చేసుకున్నాడు అని అర్థమవుతుంది. యేసు క్రీస్తు యొక్క రాక, ఆయన మరణం, పునరుత్థానము ద్వారా మన పాపములకు పరిష్కారం దొరికింది.

ఈ ప్రణాళికను గురించి పౌలు 1 కొరింథీయులకు 15:20-28లో మాట్లాడుతున్నాడు. "సమస్తమును" దేవునికి లోపరచబడియున్నదని అతడు మాట్లాడుతున్నాడు. ఈ సత్యమునే మరింతగా నొక్కి చెప్తూ 1 కొరింథీయలకు 15:42-50లో మరోసారి తెలియజేస్తున్నాడు. ఇక్కడ "మొదటి ఆదాము" చేత ఈ లోకములోకి వచ్చిన పాపపు ఫలమును "చివరి ఆదాము" రాకవలన మార్చివేయబడ్డాయని పౌలు పేర్కొంటున్నాడు. అలాగే, పాపములో పడిపోవుట ద్వారా సంభవించిన దుష్పరిణామాలన్ని సంపూర్తిగా మార్చబడినదిగా నిత్యత్వాన్ని ప్రకటన 22:1-5 చిత్రీకరిస్తుంది. జీవ వృక్ష ఫలములు గల తోటగా పరలోకం చెప్పబడింది. ఇందులోనికి ప్రవేశించే అర్హత అందరికీ ఇయ్యబడింది.

కాలమును పరిశుద్ధ గ్రంథం ఒక సరళ లేఖవలె చూపిస్తుంది. అంటే, దీనికి ప్రారంభ స్థానం (సృష్టి) ఉంది. అలాగే, దీనికి చివరి స్థానం (క్రీస్తు మరలా వచ్చినప్పుడు) కూడ ఉంది.

కొన్ని మతములు కాలమును వృత్తాకారముగా చూపిస్తాయి. వారి ప్రకారం దీనికి ఆరంభం లేదు అంతము లేదు. అలా వృత్తాకారములో తిరుగుతూనే ఉంటుంది. ఇంకా చెప్పాలంటే పరిశుద్ధ గ్రంథ దృక్కోణం నుండి పరిశీలిస్తే ఈ వాదన హేతువాదన. ఎందుకంటే, ఇందులో ఏ మార్పు ఉండదు. ఇందులో పాపమునకు పరిష్కారముండదు, మరణముండదు, వేదన, శ్రమలుండవు. కేవలం అదే విషయాల పునరాగమనం ఉంటుంది. వాక్యం ప్రకారం, కాలమును సరళ లేఖగా చూస్తే, ప్రతిది కూడ గొప్ప అంతమునకు, మనలను నిర్మించిన దేవునితో సమాధానపడుటకును పరుగెడుతుంది. అంటే, ప్రతి ఒక్కరము కూడ కాలసంద్రంలో కొట్టుకుపోతూ నిత్యత్వము వైపునకు త్రోయబడుతున్నారు. ఆ నిత్యత్వం క్రీస్తు ద్వారా నిత్యజీవితమైనా కావచ్చు లేదా ఆయన లేని నిత్య నరకమైనా కావచ్చు.

## రక్షణ అనేది నిబంధన మీద ఆధారపడియుంది

ఆదికాండము 12వ అధ్యాయములో దేవుడు అబ్రాహాముతో మాట్లాడి ఒక నిబంధన చేసుకున్నాడు. "వాగ్దానముల" చేత స్థిరపరచబడిన ఇరుపక్షాల అంగీకారమే నిబంధన. ఇరు పక్షాల మధ్య కుదిరిన ఒప్పందమే నిబంధన. ఉదాహరణకు, వివాహ బంధము, పరిశుద్ధ గ్రంథములో పరిశీలిస్తే, దేవుడే మానవులతో నిబంధన చేసుకొనుటకు ముందుకొచ్చినవాడు. ఆయనే నియమములను విధించినవాడు, ఆశీర్వాదములను వాగ్దానం చేసినవాడు. ఆ వాగ్దానములను నమ్మడం, విధులకు విధేయుడవడం మాత్రమే మానవుని విధి. దేవుడు నిబంధన చేసినప్పుడు అది "ఇద్దరు సమజ్జీవుల మధ్య కుదిరిన ఒప్పందం" కాదు. దేవుడు అబ్రాహాముతో చేసిన నిబంధన విషయములో, ఆ నిబంధన నియమములను అంగీకరించాలా లేక తిరస్కరించాలా అన్నది అబ్రాహాముపై ఆధారపడియుంది.

ఈ నిబంధనలో ఐదు వాగ్దానములు చేయబడ్డాయి:

1. దేవుడు అబ్రాహామునకు ఒక దేశమును ఇస్తానన్నాడు (ఆదికాండము 12:1). అబ్రాహాము దేవుని మాటకు విధేయత చూపించి కనాను దేశమునకు వెళ్ళాడు. ఇక్కడ దేవుడతనితో మరింత స్పష్టముగా మాట్లాడాడు: "నీ సంతానమునకు ఈ దేశమిచ్చెదను" (7 వచనం).

2. అబ్రాహాము సంతానమును ఒక శక్తివంతమైన దేశముగా నిర్మిస్తానని దేవుడు వాగ్దానం చేశాడు, "నిన్ను గొప్ప జనముగా చేసెదను" (12:2ఎ) అని ఆయన అన్నాడు. ఆయన ఈ వాగ్దానం చేసిన నాటికి అబ్రాహాముకు సంతానం లేదు కాబట్టి ఇది వాగ్దానం గానే చేయబడింది (11:30).

3. అబ్రాహాము నామమును గొప్ప చేయుదునని దేవుడు చెప్పాడు (2 వచనం). అంటే అబ్రాహాము పేరు ప్రఖ్యాతి చెందేలా చేస్తానని ఆయన అర్థము. ఈ వాగ్దనం సత్యమని నిరూపించబడినది. ఆయన పేరు అన్ని తరములలోనూ, ప్రపంచమందంతటా ప్రఖ్యాతి చెందింది.

4. అబ్రాహామును దేవుడు సంరక్షిస్తాడు. "నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను" (12:3ఎ).

5. అబ్రాహాము ద్వారా భూమియందున్న సమస్త దేశములు ఆశ్వీదించబడుతాయని ఆయన వాగ్దానం చేశాడు (12:3).

దేవుడు చెప్పినది నమ్మడము, ఆయన చెప్పినది చేయడం మాత్రమే అబ్రాహాము పని. అబ్రాహాము యొక్క విశ్వాసమునకు పెద్ద పరీక్ష 1వ వచనంలోనే చెప్పబడింది: "నీవు లేచి నీ దేశమునుండియు నీ బంధువులయొద్దనుండియు నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము." అబ్రాహామును దేవుడు కేవలం తన స్వదేశమునే విడిచి పెట్టమని చెప్పలేదు గాని, తన స్వజనులను (వారు విగ్రహారాధికులని తరువాత చూస్తాము) కూడా విడిచి పెట్టమని చెప్పాడు. యిలా చేయడం ద్వారా తనకున్న సుఖభోగాలను, లోకపర వస్తు ఆస్తులను అన్నిటిని త్యజించడమే. ఇంత చేశాక అతడు ఏ ప్రదేశమునకు వెళ్ళాలి? "నేను చూపించు దేశమునకు." ఆ సమయంలో అతనికి అదే తెలుసు. ఇంతకు మించి వివరాలేమి అతనికి తెలియదు. ఈ స్థలం గురించి మరింతగా తెలుసుకోవాలంటే, అబ్రాహాము దేవున్ని పూర్తిగా విశ్వసించి వెళ్ళమన్న చోటికి వెళ్ళాల్సిందే. అబ్రాహాము తనకు మేలు చేసుకొను నిమిత్తము "యెహోవా అతనితో చెప్పినప్రకారము అతడు వెళ్లెను" అని 12:4ఎలో వ్రాయబడింది.

దేవునిని నిబంధనా కర్తగా, నిబంధనను అనుసరించువానిగా వాక్యం చూపిస్తుంది. ఆయన సృష్టి ఆయన వాక్యమును సంపూర్తిగా నమ్మవచ్చు. వాక్యంలో మనకెన్నో ఉదాహరణలు కనబడుతున్నాయి. అయితే కొన్నింటిని ఇక్కడ చూద్దాము. జలప్రళయం. అందులోనుండి నోవహు కుటుంబాన్ని రక్షించడం గురించి దేవుడు నోవహుతో ఒక నిబంధనను చేశాడు. మరిక ఎన్నడునూ భూమిని నీటిచేత నాశనం చేయనని ఆయన వాగ్దానం చేశాడు (ఆదికాండము 6:5-9:17). తరువాత, ఆయన సీనాయి పర్వతం తగ్గర ఇశ్రాయేలీయులతో నిబంధన చేసికొనెను, వారు ఆయన ప్రజలుగా ఉండగోరితే దేవుడు వారి దేవుడై ఉండే అవకాశాన్ని కలిగించాడు. ఆ వాగ్దానములోని ఒక విషయాన్ని కూడ ఆయన తప్పిపోయినవాడు కాడు (నిర్గమకాండము 19; 20). తరువాత క్రీస్తు యేసుని ద్వారా సమస్త మానవులతో ఆయన ఒక నిబంధన చేశాడు. అది "క్రొత్త నిబంధన." ఆయన సిలువలో చేసిన త్యాగం ద్వారా క్రీస్తునందలి విశ్వాసం ద్వారా, దేవుడు నిత్యరక్షణను వాగ్దానం చేశాడు (లూకా 22:20; హెబ్రీయులకు 9:11-22). మనలను సృష్టించిన దేవునితో నిబంధన ద్వారా సంబంధమును ఏర్పరచుకుని ఆయన ఆశీర్వాదములను పొందాలి, ఇదే క్రీస్తు యేసుని సువార్త.

## అబ్రాహాము సంతానము ద్వారా రక్షణ దొరుకుతుంది

దేవుడు అబ్రాహామును ఒక "గొప్ప జనాంగముగా" చేస్తానని వాగ్దానం చేశాడు. అయితే ఇందులో ఒక సమస్య ఉంది: అబ్రాహాము ముసలివాడు, సంతానహీనుడు, దేవుడు చేసిన నిబంధనను నమ్మడానికి అబ్రాహామునకు ఇది ఒక పెద్ద అవరోధంలా ఉండి ఉండవచ్చు. అందుకనే ఈ వాగ్దానము ప్రత్యేకించి ఆదికాండము 15:1-6 మీద కేంద్రీరించబడింది. ఇక్కడ దేవుడు మరోసారి "నీ బహుమానము అత్యధికమగును" అని వాగ్దాన నిశ్చయతను ఇచ్చాడు (1 వచనం). అందుకు అబ్రాహాము కొంత నిరుత్సాహముతో "ప్రభువైన యెహోవా నాకేమియిచ్చిననేమి! నేను సంతానము లేనివాడనైపోవుచున్నానే; దమస్కు ఎలీయెజెరే నా యింటి ఆస్తికర్తయగును గదా ... ఇదిగో నీవు నాకు సంతాన మియ్యలేదు గనుక నా పరివారములో ఒకడు నాకు వారసుడగును" (15:2, 3) అని అన్నాడు. తనకు పుట్టబోయే

కుమారుడే తనకు వారసుడు అవుతాడు అని, ఆకాశ నక్షత్రములవలె అసంఖ్యాత సంతానముగా తన సంతానం అవుతారని దేవుడు మరోసారి అబ్రాహాముతో నిశ్చయతనిచ్చాడు (15:4, 5). దేవుడు ఎవరి ద్వారా ఈ లోకమును దీవించాలనుకున్నాడో వారికి సంతానహీనతను ఇవ్వలేదు.

తిరిగి, ఆ ఆశీర్వాదం మరొకరి ద్వారా కొనసాగించబడింది. పౌలు దీనినే గలతీయులకు 3:16లో వ్రాస్తున్నాడు, "అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు – సంతానములకును అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టే – నీ సంతానమునకును అనెను; ఆ సంతానము క్రీస్తు." దేవుడు అబ్రాహామునకు ఇచ్చిన వాగ్దానమును నలభై తరముల తరువాత క్రీస్తు ద్వారా నెరవేర్చాడు. క్రొత్త నిబంధన ఈ మాటలతో ప్రారంభమవడములో ఏ మాత్రము ఆశ్చర్యము లేదు "అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడైన యేసు క్రీస్తు వంశావళి" (మత్తయి 1:1).

ప్రత్యేకించి యేసు క్రీస్తు ద్వారానే దేశములన్నియు ఆశీర్వదించబడ్డాయి. అబ్రాహాము యొక్క భౌతిక సంతతి అయిన ఇశ్రాయేలుకు వెలుపటనున్న వారికి యిస్తానన్న ఆశీర్వాద వాగ్దానమైన, "భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును" (ఆదికాండము 12:3) అన్నది క్రీస్తు ద్వారా నెరవేర్చబడింది. ఈ వాగ్దానం ఇలాగే కొనసాగించబడుటకు క్రీస్తు పరలోకమునకు వెళ్ళుటకు ముందు, "మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మునియొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి" (మత్తయి 28:19) అని శిష్యులకు ఆజ్ఞాపించాడు. దేవుడు అబ్రాహామునకు ఇచ్చిన వాగ్దాన నెరవేర్పు ఇది. అతడి సంతతి ద్వారా లోకం మొత్తం ఆశీర్వదించబడుతుంది.

### విశ్వాసం మీదనే రక్షణ ఆధారపడియుంది

దేవుడు తాను ఇచ్చిన వాగ్దానములను నమ్మాలని, ఈ లోక నమ్మకత్వమును విడిచి పెట్టాలని, దేవుని మీదనే పూర్తి నమ్మికయుంచాలని ఆయన ఆదికాండము 12:1–4లో అబ్రాహామును ఆదేశించాడు. కనాను దేశంలోని ఫర్యాటక అందాలను చూసి మురిసిపోవాలని లేదా ఆ దేశంలోని సంపదయందు అబ్రాహాము మునిగిపోవాలని దేవుడు అనుకోలేదు. దేవుడు కేవలం మాట మాత్రమే చెప్పాడు. అలాగే, సంతానము గురించి దేవుడు వాగ్దానం చేసినప్పుడు తాను మరణమునకు దగ్గరగా వృద్ధాప్యములోనున్నవాడను, ఒక గొప్ప జనాంగమునకు తండ్రిని కాగలనన్న భావన ఎదురయియుండవచ్చు (హెబ్రీయులకు 11:12; రోమీయులకు 4:19). అయితే అలాగాక అతడు "దేవుని నమ్మెను" అని ఆదికాండము 15:6 స్పష్టం చేస్తుంది. తన భౌతిక స్థితి దేవుని వాగ్దానములకు విభిన్నముగానున్నను, అబ్రాహాము దేవునియందు, ఆయన వాగ్దానములయందు నమ్మికయుంచాడు.

తురవాత, ఆ విశ్వాసమునకు గట్టి పరీక్ష ఎదురయింది. దేవుడు చేసిన వాగ్దానములు ఎవరి ద్వారానయితే నెరవేరవలసియున్నాయో ఆ కుమారుడై ఇస్సాకును తీసుకుని మోరీయా పర్వతమునకు వెళ్ళి అక్కడ అతనిని దేవునికి బలి ఇవ్వమని అబ్రాహాము ఆజ్ఞాపించబడినట్లు ఆదికాండము 22లో మనం చూస్తున్నాము. ఒకవేళ దేవుడు మధ్యలో కల్పించుకుని, విశ్వాస పరీక్ష నెగ్గావని అబ్రాహామును ఆపకపోయియున్నట్లయితే అబ్రాహాము బలి ఇచ్చేవాడేమో!

అతడు పూర్తి విశ్వాసమును కనపరిచాడు. ఇస్సాకును బలి యివ్వడానికి అబ్రాహాము ఎలా సిద్ధపడ్డాడా అని మనకు ఆశ్చర్యం వేస్తుంది. తన సంతతిని గొప్ప "జనాంగముగా" చేస్తున్న దేవుని వాగ్దానమునకు వ్యతిరేకంగా పనిచేయడం గదా అని అతనికి అన్పించలేదా? యిలా తర్కించి అవిధేయత చూపించడం అతనికి ఎంతో సులభం. కానీ అతడలా చేయలేదు. దీనికిగల కారణమును బైబిలు తరువాత యిలా తెలియజేస్తుంది:

> అబ్రాహాము శోధింపబడి విశ్వాసమునుబట్టి ఇస్సాకును బలిగా అర్పించెను. ఎవడు ఆ వాగ్దానములు సంతోషముతో అంగీకరించెనో, – ఇస్సాకువలననైనది నీ సంతానమనబడును అని ఎవనితో చెప్పబడెనో, ఆ అబ్రాహాము, *మృతులను సహితము లేపుటకు దేవుడు శక్తిమంతుడని యెంచినవాడై,* తన యేకకుమారుని అర్పించి, ఉపమానరూపముగా అతనిని మృతులలోనుండి మరల పొందెను (హెబ్రీయులకు 11:17–19; నొక్కి చెప్పింది నాది).

తన కుమారుని అర్పించుటకు అబ్రాహాము ఏ విధముగా విశ్వాసమును కూడబెట్టాడు? దేవుని వాగ్దానములు, దేవుని శక్తియందు సంపూర్ణ నమ్మికయుంచి, తాను బలి అర్పించిన కుమారుని చనిపోయినను దేవుడు తిరిగి లేపుతాడని నమ్మకముంచాడు. ఒక్కసారి అబ్రాహాము తూలినా, అతడి విశ్వాసం సన్నగిల్లినా, తనను పిలిచి, తన వాక్కును ఇచ్చిన దేవుని యొద్దకే మరల వచ్చేవాడు. కాబట్టి పౌలు "నిజమైన విశ్వాసి" గురించి చెబుతూ అతడు అబ్రాహామును ఉదహరించాడు:

> … అవిశ్వాసమువలన దేవుని వాగ్దానమును గుర్చి సందేహింపక దేవుని మహిమ పరచి, ఆయన వాగ్దానము చేసినదానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసమువలన బలమునొందెను. అందుచేత అది అతనికి నీతిగా ఎంచబడెను. అది అతనికి నీతిగా ఎంచబడెనని అతని నిమిత్తము మాత్రమే కాదుగాని మన ప్రభువైన యేసును మృతులలోనుండి లేపినవానియందు విశ్వాసముంచిన మనకును ఎంచబడునని మన నిమిత్తముకూడ వ్రాయబడెను. ఆయన మన అపరాధముల నిమిత్తము అప్పగింపబడి, మనము నీతిమంతులముగా తీర్చబడుటకై లేపబడెను (రోమీయులకు 4:20–25; చూడు 1–3, 11, 12 వచనాలు).

## ముగింపు

దేవుడు అబ్రాహామును ఎదుర్కొనుట ద్వారా రక్షణ ఎలా కలుగును మరియు అది ఎలా పనిచేస్తుంది అన్న విషయాలకు సంబంధించి కొన్ని ప్రాచీన సూత్రములు, మార్గాలు ఏర్పరచబడ్డాయి. దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దాన నెరవేర్పును బట్టి నేడు మనము ఈ రక్షణను గూర్చి చూచునట్లు దీవించబడ్డాము: క్రీస్తు రాక, లోకపాపముల కొరకు ఆయన మరణం, మరియు ఆయన పునరుత్థానం. రక్షణ గురించి దేవుడు అబ్రాహాముతో ముందుగా చెప్పిన విషయం ఎంత సత్యమో నేడు కూడ అది అంతే సత్యము కాకపోలేదు; దేవుని యొక్క ఖచ్చితమైన ప్రణాళిక ద్వారా మనకు రక్షణ అనుగ్రహించబడింది. ఇది దేవుని క్రొత్త నిబంధనపై ఆధారపడియుంది. అబ్రాహాముతో చేయబడిన నిబంధన కంటెను ఇందులో మరిన్ని గొప్ప వాగ్దానములు, ఆశీర్వాదములున్నాయి (చూడు హెబ్రీయులకు 8:6, 7; 9:15). అబ్రాహాము సంతతి అయిన క్రీస్తు ద్వారా ఈ రక్షణ మనకు వచ్చింది. మనం దీన్ని అంటిపెట్టుకునియుండు మనస్సుపై దీని విజయం ఆధారపడియుంది. విశ్వాసము ద్వారా

మనం దేవున్ని నమ్ముదాము. ఆయన వాగ్దానములను విశ్వసించుదాము. ఆయన వాక్యమునకు విధేయులగుట చేత మన జీవితాలను ఆయన కాపుదలకు అప్పగించుకుందాము.

---

## క్రొత్త నిబంధనలో అబ్రాహాము

ఈ లోకమును విమోచించుటకు దైవిక ప్రణాళికలో అబ్రాహాము పాత్ర ఎంతో గుర్తించదగ్గది. అతడు పాత నిబంధనలో పెక్కుసార్లు పేర్కొనబడడమే గాకుండా 39 సార్లు క్రొత్త నిబంధనలోనూ పేర్కొనబడ్డాడు. క్రొత్త నిబంధనలో అబ్రాహాము ఎన్నో విధాలుగా చూపించబడ్డాడు:

1. పాత నిబంధనలోనున్న దేవుని గుర్తింపు క్రొత్త నిబంధనలోనూ కొనసాగింపబడిందని చూపడానికి పాత నిబంధనలో అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుడు అని పిలువబడినట్లుగానే క్రొత్త నిబంధనలోనూ ఆయన పిలువబడ్డాడు (అపొస్తలుల కార్యములు 3:13; చూడు మత్తయి 22:32; లూకా 1:55).

2. దేవుని నమ్మకత్వమును వివరించడానికి. అబ్రాహాముతో ఆయన తన వాగ్దానములను నిలుపుకున్నట్లే. ఈనాడు మన విషయంలోనూ నమ్మకస్థుడు (లూకా 1:73; అపొస్తలు కార్యములు 3:25, 26; హెబ్రీయులకు 6:13).

3. దేవుడు ఎవరి ద్వారానయితే ఇశ్రాయేలు, ఈ లోక ప్రజల పట్ల తన వాగ్దానములను నెరవేర్చాడో ఆ క్రీస్తు అబ్రాహాము “సంతానము” అని చెప్పడానికి (మత్తయి 1:1; గలతీయులకు 3:14–16).

4. రక్షణ క్రియలవలన సంపాధించుకొనుటకు సాధ్యం కాదు అని నొక్కి చెప్పుతూ, రక్షణ విశ్వాసం ద్వారా దేవుడిచ్చు బహుమానమై ఉంది (రోమీయులకు 4; గలతీయులకు 3:14–29).

5. విశ్వాసము ద్వారా మనం అబ్రాహాము యొక్క శరీరక సంతతిగాక, నిజమైన పిల్లలమవుతాము అని బోధించడానికి (యోహాను 8:33–45; రోమీయులకు 9:7).

6. విశ్వాససారమైన దేవుని వాగ్దానముల యందు నమ్మికకు ఖచ్చితమైన ఉదాహరణగా, దేవున్ని గుర్తించడమే గాకుండా, ఆయనకు విధేయులమై విశ్వాసం యొక్క నిజస్వరూపమును చూపించుటలో ఉదాహరణగా పేర్కొనుటకు (హెబ్రీయులకు 11:8–12, 17–19; యాకోబు 2:21–23; చూడు మత్తయి 3:9).

7. అబ్రాహాము, మరియు యితర విశ్వాస వీరులతో కలిసి పరలోకంలో ఉండే ఆనందమును వివరించుటకు (మత్తయి 8:11; లూకా 13:28; 16:22, 23).